దరిచేరిన పోలింగ్ కేంద్రం

- ఓటింగ్ పెంచేందుకు ఎన్నికల సంఘం చర్యలు
- బేల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు
- ఓటర్లకు తగ్గిన దూరభారం


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లు

బేల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో మొదటిసారి అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఒకటిన్నర కిలోమీటరు దూరం నుంచి పోలింగ్ కేంద్రం ఓటర్లకు దగ్గరైంది. ఈసారి ఈ కేంద్రంలో మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. దీంతో పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. గతంలో ఇక్కడే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీ ఎన్నికలు నిర్వహించారు. దూరం తగ్గడంతో రవాణా భారం ఇబ్బందులు తొలగిపోయి, స్థానికంగా ఎన్నికల ఖర్చు తగ్గింది.

మొదటిసారి అసెంబ్లీ ఎన్నికలు..

గతంలో సాధారణ, స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామానికి ఒకటిన్నర కిలోమీటరు దూరంలోని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలోని జరిగాయి. అసెంబ్లీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు సైతం అక్కడే నిర్వహించారు. పోలింగ్ కేంద్రం దూరంగా ఉండడంతో వయసు పైబడిన వయోజనులు, వృద్ధులు, వికలాంగులు, మహిళలు ఓటు వేసేందుకు ఆసక్తి చూపలేదు. మొత్తంగా పోలింగ్ 85 శాతం లోపే ఉండేది. ఆయా పార్టీల వారు పోలింగ్ కేంద్రానికి ప్రైవేటు వాహనాల్లో తీసుకెళ్తూ.. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేవారు. ఈక్రమంలో గతసారి సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ముగిసిన వెంటనే పోలింగ్ కేంద్రం దగ్గరకు మార్చాలని ఓటర్లు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీంతో పాటు దూరపు పోలింగ్ కేంద్రంపై ‘సాక్షి’లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన జిల్లా ఎన్నికల అధికారులు పరిస్థితులపై పలు పరిశీలనలు చేసి, పోలింగ్ కేంద్రాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మార్చారు. ఈ పోలింగ్ కేంద్రంలో మొదటిసారిగా అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది.

మూడు పోలింగ్‌బూత్‌లు..

మండల కేంద్రంలో మూడు వేలకు పైబడి ఓటర్లు ఉండడంతో నూతన పోలింగ్ కేంద్రంలో మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. గరిష్టంగా ఓటర్ల సంఖ్య మొత్తం 1,200 ఓటర్లకు ఒక్కో పోలింగ్ బూత్‌గా నిర్ణయించారు.

ఓటర్ల వివరాలు..

పోలింగ్‌బూత్ నం.	స్త్రీలు	పురుషులు	మొత్తం
68	591	635	1,226
70	640	619	1,259
71	526	531	1.057
మొత్తం	1,757	1,785	3,542

నేరుగా వెళ్లి ఓటు వేయొచ్చు



గతంలో పోలింగ్ కేంద్రం రెండు కిలోమీటర్ల దూరంలో ఉండేది. కాలినడకన నేరుగా వెళ్లలేకపోగా.. ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వచ్చింది. కొందరూ పోలింగ్ కేంద్రం దూరంగా ఉండడడంతో ఓటు వేసే వాళ్లు కాదు. ఇప్పుడు నూతన పోలింగ్ కేంద్రం గ్రామం మధ్యన ఉండడంతో నేరుగా వెళ్లి ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది.

– గోహర్కర్ సీతరాం, పాతబస్తీ

ఓటింగ్ శాతం పెరుగుతుంది



గతంలో ఎమ్మెల్యే ఎలక్షన్ వరకు హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రం ఉండేది. దీంతో మహిళలు, వృద్ధులు ఓటు వేయడానికి ఆసక్తి చూపేవారు కాదు. ఈసారి గవర్నమెంట్ కాలేజీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో అందరికి దగ్గరైంది. ఎటువంటి వాహనాలు అవసరం లేదు. ప్రతిఒక్కరూ ఓటు వేయడంతో ఓటింగ్ శాతం పెరుగుతుంది.

– కుర్మ గంగన్న, అశోక్ నగర్‌కాలనీ

వ్యవసాయం పండుగలా మారింది

- ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న


ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని దండుగ కాదు పండుగలా మార్చారని ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అర్లి, జందాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నల్ల వ్యవసాయ చట్టాలు తెచ్చి రైతుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్న బీజేపీకి, వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుంది అన్న కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అన్నదాతలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం కడుపులో పెట్టుకుని చూసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేశ్, మాజీ జెడ్పీటీసీ కొండ గంగాధర్, సర్పంచులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

ఎదులాపురం: ఆదిలాబాద్ పట్టణంతో పాటు రూరల్ ప్రాంతానికి చెందిన 300 మంది బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు, యువకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మూడోసారి సీఎం కేసీఆర్‌ను గెలిపించుకొని అభివృద్ధితో పాటు సంక్షేమ ఫలాలను పొందాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, నాయకులు సత్యనారాయణ, గంగాధర్, రామ్‌కుమార్, రమేశ్, ఏజాజ్ పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

ఎదులాపురం: ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే జోగు రామన్న రాజశ్యామల, చండీ యాగాన్ని తలపెట్టారు. మూడు రోజులుగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహిస్తున్న హోమం ఆదివారం ముగిసింది. యాగం అనంతరం ఎమ్మెల్యే కుటుంబీకులు వేద పండితులు ఆశీర్వచనాలు తీసుకున్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని రాజశ్యామల యాగం చేపట్టినట్లు తెలిపారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామన్న

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

- బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావు


మాట్లాడుతున్న సోయం బాపూరావు

తలమడుగు: ప్రతిఒక్కరూ బీజేపీ గెలుపునకు కృషి చేయాలని బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆదివాసీల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ అధికారంలో వస్తే ఉచిత విద్య, వైద్యం, పుట్టిన ఆడ బిడ్డకు రూ.2లక్షల డిపాజిట్, ఉచిత సిలిండర్లు అందజేస్తామన్నారు. అలాగే రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు. ఈ ఎన్నికలు ఆదరించి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తలమడుగు సార్‌మేడి సిడం, మాధవ్, కుమ్ర జ్ఞానేశ్వర్, తుడుందెబ్బ నాయకుడు గోడం భుజంగరావు, నైతం సూర్యభన్, పెందోర్ మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాంగ్ సమాజ్ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కమిటీ సభ్యులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మాంగ్ సమాజ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా అధ్యక్షుడు గాడీకర్ పరుశురాం మాంగ్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వాగ్‌మారే అంకుష్, ఉపాధ్యక్షుడిగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా సముక్‌రావ్ హరిదాస్, కోశాధికారిగా కాంబ్లే జ్ఞానేశ్వర్, సంయుక్త కార్యదర్శిగా మోతివార్ కపిల్, సలహాదారుడిగా సూర్యవంశీ విఠల్, సభ్యులుగా దీపక్, ఆదిత్యలను ఎన్నుకున్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న రవికిరణ్ యాదవ్

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గంవర్క్ అంశాల్లో శిక్షణ పొందిన వారికి ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ట్రస్ట్ ద్వారా మూడు నెలల పాటు శిక్షణ కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నవీన్ యాదవ్, శ్రీనివాస్, రమేష్, రామన్న, లక్ష్మి, పూజ, శ్రావణి, వీణా పాల్గొన్నారు.

ఘనంగా సహస్రార్జున జయంతి


వేడుకలో పాల్గొన్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సహస్రార్జున జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఎస్ఎస్‌కే పట్కరి కులసంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గంగమోహన్, షికారి రమేష్, శికారి రవి, శికారి పవన్, దొండి ప్రకాశ్, శ్రీను, లక్ష్మీనారాయణ, మండి దత్తు, శంకర్, హరికృష్ణ, నందు, శ్రీకాంత్, రంజిత్, వంశీ, తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న భూమన్న

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట జేఏసీ సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నూతన అంబేద్కర్ భవనంలో మాట్లాడారు. ఈనెల 11న హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభలో ప్రధాని నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఒకవర్గానికి మద్దతివ్వడం సరికాదన్నారు. ప్రధాని వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడిన మాటలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏకగ్రీవంగా మాల ఉపకులాల జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నుకున్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట జేఏసీ కమిటీ కన్వీనర్‌గా ఏకగ్రీవంగా అల్లూరి భూమన్న, కోశాధికారిగా రమేశ్, సాయిబాబా, కోకన్వీనర్లుగా రత్నజాడే ప్రజ్ఞకుమార్, దుర్గే నారాయణ, కుర్మే లక్ష్మణ్, బొజ్జ రవి, రాజారెడ్డి, బాబాసాహెబ్ కాంబ్లే, మస్కే రాజు, శోభాతాయి, సుభాష్, ప్రజ్ఞశీల్, శశికాంత్, తొగరి భాస్కర్, కాంతారావు వాఘ్మరే, దేవిదాస్, భూమన్న, సత్యనారాయణ, ప్రశాంత్, కిరణ్‌లను ఎన్నుకున్నారు.

అన్నదానం

కైలాస్‌నగర్: నిరుపేదల ఆకలిని తీర్చేందుకు సంగెం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ట్రస్ట్‌సభ్యులు పేదలకు అన్నదానం చేశారు. ఈ వారంతో అన్నదానం 136వ వారానికి చేరుకుంది. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగి దిలీప్, ట్రస్ట్ సభ్యులు న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, సింగం, మహేందర్ రెడ్డి, సలీమ్, శుభాష్, అంబయ్య, రాజయ్య, లకన్ పాల్గొన్నారు.

సన్మానం

నేరడిగొండ: వైద్య వృత్తిలో రాణించి పేదలకు సేవలు చేయాలని ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ డైరెక్టర్ ఆడె వసంత్‌రావులు అన్నారు. చిన్నబుగ్గారం గ్రామానికి చెందిన రాథోడ్ లహరి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం పట్ల ఆదివారం మండల కేంద్రంలో ఆమెను ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆడె బాబులాల్, జాదవ్ రూప్‌సింగ్, వినోద్, జీవన్, యశ్వంత్, డిగ్‌రెడ్డి, కిషన్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న భక్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో ఆదివారం వేకువ జామున పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయ ప్రాంగణంలో హోమం, అర్చన, నవగ్రహ పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వేకువజామున పోచమ్మ, సర్గమ్మ తల్లి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగయ్య, గ్రామపెద్దలు నర్సింగ్, దత్తు, రాంచంద్రారెడ్డి, స్వామి, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తా

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్


ఖానాపూర్: ప్రచారం చేస్తున్న జాన్సన్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు

ఖానాపూర్: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఖానాపూర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో మార్నింగ్‌వాక్ చేస్తూ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజేందర్, రాము నాయక్, కరిపె శ్రీనివాస్, వెంకట్‌మహేంద్ర, ప్రదీప్, రవి, సుమిత్ తదితరులు ఉన్నారు.

కడెం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ఏఎంసీ డైరెక్టర్ బోయిని మంగ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి

- బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్


భీంపూర్‌లో ప్రచారం చేస్తున్న అనిల్ జాదవ్

తాంసి: రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం భీంపూర్ మండలంలోని భీంపూర్, గుంజాల గ్రామాల్లో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రచారం చేశారు. కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, కన్వీనర్ నాగయ్య, వన్నెల అశోక్, సర్పంచ్‌లు లింబాజీ, పైకు, రవీందర్, లస్మన్న, అనిల్, సంతోష్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ కోరారు. మండలంలోని సూర్యగూడకు చెందిన పలువురు యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అన్నివర్గాలు అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు. పాండుగూడ, జీడిపల్లె, వైజాపూర్, గోపాల్‌పూర్, కమలాపూర్ గ్రామాల్లో నాయకులు ప్రచారం చేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్లు తిరుమల్‌గౌడ్, ఆడే శీలా, రమేష్ జాదవ్, మాధవ్ కేంద్రే, జమీల్, సోయం సతీష్, జంగు, దోమకొండ సుధాకర్, సంగ ఆశన్న పాల్గొన్నారు.

ఇచ్చోడ: సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం ఇచ్చోడ మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, ఇచ్చోడ ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, పాండురంగ్ పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంతో పాటు మండలంలోని సొనాలలో ఆదివారం ఎంపీపీ తుల శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు, గ్రంథాయల డైరెక్టర్ రమణ గౌడ్, ప్రవీణ్, రమణ, రఫీ, తుకారాం పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలని హర్కాయి, అనంతపూర్, టెంబి, మంజరంతండాల్లో ఆదిలాబాద్ మాజీ ఎంపీ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న, నానం రమణ, సర్పంచులు పాల్గొన్నారు.

తెరపైకి కుప్టి ప్రాజెక్టు

- నిర్మిస్తామని సీఎం కేసీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిల హామీ
- ఇప్పటికే మూడుసార్లు డీపీఆర్
- తర్వాత ఊసేలేని వైనం


కడెం ప్రాజెక్టుకు పరివాహక ప్రాంతమైన కుప్టి

నేరడిగొండ: ఎన్నికల వేళ కుప్టి ప్రాజెక్ట్ నిర్మాణంపై ఆయా పార్టీల నాయకులు ప్రచార సభల్లో హామీలు గుప్పిస్తున్నారు. కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తామని చెబుతుండడంతో మళ్లీ ప్రాజెక్ట్ నిర్మాణం తెరపైకి వచ్చింది. ఈనెల 15న బోథ్‌కు వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కుప్టి ప్రాజెక్టుపై మాట్లాడారు. ఇక్కడ కుప్టి ప్రాజెక్టు పూర్తి కావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. నిధులు మంజూరు చేసి ప్రారంభోత్సవానికి వచ్చే బాధ్యత నాదే అని హామీ ఇచ్చారు. ఇదిలా ఉంటే ఈనెల 16న ప్రజా ఆశీర్వాద సభను ఇచ్చోడలో నిర్వహించగా సీంఎ కేసీఆర్ హాజరయ్యారు. బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ విజ్ఞప్తి మేరకు కుప్టి రిజర్వాయర్ ప్రారంభించి పూర్తి చేసే బాధ్యత తనదేనన్నారు. ముఖ్య నాయకులు ఇలా వివరిస్తుండడంతో కుప్టి ప్రాజెక్టుపై మరింతగా ఆశలు చిగురిస్తున్నాయి.

ముందడుగు పడేనా?

కుప్టి బహుళార్థసాధక ప్రాజెక్ట్ నిర్మాణానికి ముందడుగు పడుతుందా? లేదా? అనే అనుమానం నెలకొంది. తాజాగా ప్రాజెక్ట్ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఇప్పటికే మూడుసార్లు డిటేల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారు చేసిన తర్వాత నిర్మాణ మంజూరు అంశం ఊసే లేకుండా పోయింది. 2015 జూన్‌లో నేరడిగొండ సమీపంలోని కుప్టి గ్రామం వద్ద బహుళార్థసాధక ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నివేదిక కోరింది. డిటేల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారు కోసం రూ.1 కోటి 47 లక్షల పరిపాలన ఆమోదం ఇచ్చింది. దీనికి ప్రభుత్వం పరిపాలన పరమైన ఆమోదం అప్పట్లోనే తెలిపింది. దీన్ని కడెం ప్రాజెక్ట్‌కు నిల్వ, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఉపయోగించడం కోసం నిర్మించాలని స్పష్టం చేసింది. 2020- 21 నుంచి మూడుసార్లు డీపీఆర్ మారుతూ వచ్చింది.

పంట కాలం ముగిసే సమయానికి నీటి కొరత..

ఆయకట్టుకు నీటి డిమాండ్ ప్రధానంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఉంటుంది. పంట కాలం ముగిసే సమయానికి నీటి కొరత ఏర్పడుతుంది. ఇది రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. బచావత్ అవార్డు ప్రకారం కడెం రిజర్వాయర్‌కు 68,150 ఎకరాల ఆయకట్టుకు 13.42 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చని ఉంది. అయితే ఈ ప్రాజెక్టు జూలై నుంచి సెప్టెంబర్ నెలలో మాత్రమే నీటిని స్వీకరిస్తుంది. అది కూడా 7.20 టీఎంసీలకు మాత్రమే పరిమితమైంది. దీంతో పంటలకు నీరందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణమైతే బోథ్ నియోజకవర్గ ప్రాంత రైతులకు సాగునీరు అందనుంది.

ఇందిరాగాంధీకి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

బేల: మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ వై. రాజారెడ్డి ఇంటి ప్రాంగణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, సామ రూపేష్‌రెడ్డి, దేవ్‌తాళే విఠల్, వాంఖడే వామన్, గుండవార్ సంజయ్, చంద్రకాంత్, వాంఖడే రూప్‌రావు పాల్గొన్నారు.